


*అనగనగా ఓ నాన్న*

నా **'చంటబ్బాయ్'** నవలని సినిమాగా తీసే రోజుల్లో ఓసారి జంధ్యాల అన్నారు.

"మీ నవలల్లో వెదుకులాట ఎక్కువగా ఉంటుంది."

నిజమే. ఉత్కంఠ కోసం నా కథల్ని ఆ కోణంలోంచి రాస్తూంటాను. మేఘమాల, రేపటికొడుకులాంటి ఫేమిలీ డ్రామాల్లో కూడా వెదుకులాట ప్రధానాంశం. ఆ కోవకి చెందిన మరో నవల 'అనగనగా ఓ నాన్న.'




నా నవల 'ఈ గంట గడిస్తే చాలు' ఆధారంగా నిర్మాత దొరైసామిరాజు గారు కోదండరామిరెడ్డి దర్శకత్వంలో సినిమా తీయాలనుకున్నారు. ఆ సందర్భంగా మద్రాస్‌లోని పామ్‌గ్రోవ్ హోటల్లో జులై 1991లో అనుకుంటా కథా చర్చ మొదలైంది. ఆ నవలని చదివిన గణేష్ పాత్రో రఫ్‌గా అల్లిన కథని చెప్పారు. ఆయన బాలచందర్ సినిమాలకి రాసిన అద్భుతమైన సంభాషణలకి నేను అభిమానిని. పాత్రో సెంటిమెంట్‌ని చక్కగా రాస్తారు. ఐతే ఈ గంట గడిస్తే చాలుకి ఆయన చెప్పిన ఆరంభం నవల్లోలాగా కాక స్లోగా ఉంది. క్రైం సినిమాల్లో మొదటి పది నిమిషాల్లో నే చివరిదాకా సాగే సస్పెన్స్‌కి ముడిపడాలని కాబట్టి అలా మొదలవకపోతే మంచిదని నేను చెప్పాను.

"అంటే ఎలా మొదలవ్వాలి?" దొరసామిరాజు అడిగారు.

"ఐదు నిమిషాలు టైం ఇవ్వండి."

ఐదు నిమిషాల తర్వాత నేను తర్వాతి కథ అనుకోని ఓ ఆరంభాన్ని మాత్రమే చెప్పాను.

"ఓ డాక్టర్ తన దగ్గరకి పోస్ట్‌మార్టంకి వచ్చిన శవం తన తల్లిదే అని గ్రహించాడు. తనా పనిచేయలేక మరొకరికి ఆ పనిని అప్పగించాడు. ఆవిడకి పోస్ట్‌మార్టం నిర్వహించిన ఆ తోటి డాక్టర్ అతని తల్లికి అసలు గర్భసంచి లేదని చెప్పింది."

"తర్వాత?" అంతా ఆసక్తిగా అడిగారు.

"ఇంతదాకానే ఆలోచించాను. ముగింపు దాకా తీసుకెళ్ళే

సస్పెన్స్ ఇలా మొదటి పదినిమిషాల్లోనే ప్రేక్షకులకి అందాలి."

ఐతే రాంగోపాల్ వర్మ 'క్షణక్షణం' అనే సినిమా ఆరంభిస్తున్నారని, ఆ కథ 'ఈ గంట గడిస్తే చాలు' నవల కథకి దగ్గరగా ఉందని, ఆపేద్దామని 'ఈ గంట గడిస్తే చాలు'లో నటించడానికి అంగీకరించిన నాగార్జున చెప్పారు. దాంతో అంతా ఎవరిళ్ళకి వాళ్ళం వెళ్ళిపోయాం.

అది అంతా అక్కడితో మర్చిపోయినా ఆ ఆరంభం నన్ను వేటాడింది. క్రమంగా తర్వాతి కథని అల్లుకున్నాను. అర్ధాయుష్కుడైపోయాడు కానీ నా అభిమాని, మిత్రుడు, దర్శకుడు ఎం.నందకుమార్ జీవించి ఉంటే ఆ కథని తెరకెక్కించి ఉండేవాడు. అంతగా అతనికి ఆ కథ నచ్చింది. తర్వాత దాన్ని కోల్డ్ స్టోరేజ్‌లో పడేసాను.

2010లో విజయవాడ నించి చిత్ర మాసపత్రిక ఆరంభమైంది. దాని ప్రొప్రయిటర్ శ్రీ రాజా, ఎడిటర్ శ్రీ యజ్ఞప్రసాద్ ఓ రోజు మా ఇంటికి వచ్చారు. వారు నా సీరియల్ కోరితే రెండు థీమ్స్ చెప్పాను. అందులో వారు ఎన్నుకున్న థీమ్‌ని సీరియల్‌గా 'అనగనగా ఓ నాన్న' పేర రాసాను. ఆ నాడు నేను ఉదాహరణగా చెప్పిన ఆ ఓపెనింగ్‌తో అల్లుకున్న, నందకుమార్‌కి నచ్చిన కథే అది.

క్లుప్తంగా ఆ నవల కథ ఇది.

డాక్టర్ త్రివిక్రమ్ తల్లి సెల్ ఫోన్ మాట్లాడుతూ రోడ్ క్రాస్ చేస్తూండటంతో ప్రమాదవశాత్తు మరణిస్తుంది. అతని బదులు డాక్టర్ విరజ పోస్ట్‌మార్టం చేసి ఆవిడకి పుట్టుకతోనే గర్భాశయం లేదని, మధ్యలో తొలగించలేదని చెప్తుంది. గర్భాశయం లేకుండా పుట్టిన ఆవిడ పేరు జనని. బహుశ చక్కటి ఐరనీ. 272 పేజీల ఈ నవల్లో 22వ పేజీలో ఇది పాఠకులకి తెలుస్తుంది. తండ్రికి అల్‌జైమర్స్ వ్యాధి ఉండటంతో ఆయన్నించి ఏ సమాచారం తెలీదు. ఆయన డి.ఎన్.ఏతో తన డి.ఎన్ ఏని పరీక్షించుకుంటే ఆయన తన తండ్రి కాదని తెలుస్తుంది. కొంత అన్వేషణ తర్వాత తన తల్లి ఎవరో కనుక్కోగలుగుతాడు. గేంగ్ రేప్‌లో ఆమెకి గర్భం వచ్చిందని, దాంతో భర్తకి దూరమైందని తెలుస్తుంది. తన తల్లితండ్రులు బహుశ తనని పెంపుడుకి తీసుకుని ఉంటారని అనుకుని, ఆ నలుగురు గేంగ్ రేపిస్ట్‌లలో తన తండ్రి ఎవరో డి.ఎన్.ఏ ద్వారా తెలుసుకునే ప్రయత్నం చేస్తాడు. ఒకడు మరణించాడు. అతను వాడిన వస్తువుల డి.ఎన్.ఏతో తనది పోలిస్తే అతను కాదని తెలిసింది. ఇలా ముగ్గురూ కాదని తెలిసింది. నాలుగోవాడు చివరిదాకా దొరకడు.

ఐతే ఆ నలుగురిలో ఒకరు తండ్రి ఐతే కథ తేలిపోతుంది అని నాకు అనిపించసాగింది. నేను అనుకున్న మలుపు కాక, పద్మజ సూచించిన మలుపుని నవల క్లైమాక్స్‌లో వాడాను.

ఈ నవల్లో త్రివిక్రమ్ ఆ నలుగురి ఇళ్ళకి వెళ్ళినప్పుడు వాళ్ళో ఇబ్బందిలో ఉంటే వాళ్ళకి తగిన సహాయం చేస్తాడు.

ఇందులో శ్యామలరావు అనే పాత్ర డాక్టర్ త్రివిక్రమ్‌కి సహాయం చేస్తుంది. ఇది నాకు జీవితంలో పరిచయమైన పాత్రే! హైద్రాబాద్‌లో చిక్కడపల్లి బ్రాంచ్‌లో అప్పట్లో మార్గదర్శి చిట్‌ఫండ్ కంపెనీలో పనిచేసే శ్యామలరావు అనే అతను ప్రతీ నెలా చెక్ తీసుకోడానికి మా ఇంటికి వచ్చినప్పుడు కొద్దిసేపు నాతో మాట్లాడి వెళ్ళేవారు. అతనిలో ఎవరికి ఏ ఇబ్బంది వచ్చినా తక్షణం వెళ్ళి సహాయం చేస్సే తత్త్వం అధికం అని గ్రహించాను.

2006లో మా అమ్మ పోయినప్పుడు మాకు చాలా సహాయం చేసారు. అలాగే 2015లో మా రెండో అమ్మాయి ఊహ పెళ్ళైనప్పుడు శ్యామలరావు వచ్చి, పెళ్ళికూడా చూడకుండా భోజనాల దగ్గరే ఉండి అంతా పర్యవేక్షించి కేటరర్‌కి ఎంత ఇవ్వాలో లెక్క చెప్పి ఇప్పించి రాత్రి పన్నెండున్నరకి ఇంటికి వెళ్ళారు. అతని అనుమతితో ఆ పాత్రకి అతని పేరే పెట్టాను. అవకాశం ఉన్న చోటల్లా డాక్టర్ జాబాలి లాంటి పాత్ర ద్వారా హాస్యం కూడా రాసాను. ఈ నవలకోసం అల్‌జైమర్స్ గురించి తెలుసుకుని ఆ వివరాలు రాసాను. డి.ఎన్.ఏ గురించి తెలుసుకుని కూడా. దీంట్లో వాడకుండా మిగిలిన డి.ఎన్.ఏ సమాచారాన్ని తర్వాత రాసిన 'చివరి కోరిక' అనే నవల్లో వాడాను. త్రివిక్రమ్ బ్రహ్మచారి. అతని ప్రియురాలు. ఆమెది చాలా మెచూర్డ్ పాత్రగా మలిచాను.

'భావావేశం డైనమేట్ లాంటిది. అది మన ఆధీనంలో లేకపోతే మనల్ని ముంచేస్తుంది. డైమండ్ రింగ్ కొనివ్వలేదని మా పిన్ని ఆత్మహత్య చేసుకోడానికి కారణం ఆ డైనమేట్ పేలడమే' అని ఓ సందర్భంలో స్ఫూర్తి త్రివిక్రంకి చెప్తుంది.

"మామిడి చెట్టు నాటడానికి ఏది సరైన సమయం?" అని మా నాన్నగారు ఓ రోజు అడిగారు. "వానాకాలం" అని చెప్పాను.

"కాదు. పదిహేనేళ్ళ క్రితం. అప్పుడు పాతి వుంటే, ఈ రోజు మామిడి పండుని కోసుకునేవాళ్ళం. సరే. రెండో సరైన రోజు ఏది?" అని మళ్ళీ అడిగారు.

"పదిహేనేళ్ళ క్రితం మర్నాటిరోజు. రేపు కోసుకునే వాళ్ళం" అని మా అన్నయ్య చెపితే

"కాదు. ఆ రోజు నువ్వు పాతలేదుగా. ఈ రోజు సరైన రోజు" అని ఆయన చెపితే వెంటనే మా అన్నయ్య తను తిన్న మామిడి పండు టెంకని పాతాడు. ఇప్పుడది కాయలు కాస్తోంది.

ఇదే సీరియల్ నవలలు బాగా చదివే రోజుల్లో వచ్చి ఉంటే 'ఈ గంట గడిస్తే చాలు, శనివారం నాది, మిస్టర్ వి' లాగా పాఠకులకి గుర్తుండిపోయేది. ఆ నవలల్లోని ఎలిమెంట్స్ అన్నీ 'అనగనగా ఓ నాన్న'లో ఉన్నాయి. కానీ పాఠకులు బాగా తగ్గిన 2011లో సీరియల్‌గా రావడంతో ఆ గుర్తింపు చదివిన పరిమిత పాఠకుల్లో మాత్రమే ఉండిపోయింది తప్ప చదవడం విరమించుకున్న పాఠకులకి ఇది తెలీదు. సీరియల్ పూర్తవగానే సెప్టెంబర్ 2011లో పుస్తకంగా వెలువడింది. 272 పేజీలు. వెల రూ.120 / - ఇది చాలా త్వరగా అమ్ముడైన నవల. నవల్లోని ఉత్కంఠ ఓ కారణమైతే, ఇందుకు మరో కారణం బహుశ ఈ నవల మొదటి పేజీలో నేను పాఠకులకి రాసిన ఓ ముందుమాట కొంతదాకా దోహదం చేసింది. తర్వాత చాలామంది పాఠకులు నన్ను కలిసినప్పుడు దాన్ని చదివి తామా నవల కొన్నామని చెప్పారు.

www.anandbooks.com
www.telugubooks.in
*ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి*

Post your comments